క్లుప్తంగా

రేపు వైఎస్సార్ వర్ధంతి

కలికిరి: కలికిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కలకడ : దివంగిత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని మంగళవారం ఉదయం 10 గంటలకు కలకడ బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తామని పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీసులో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ జాఫర్

రామసముద్రం: మండలంలోని మూగవాడి గ్రామంలో ఆదివారం రైతులకు వ్యవసాయాధికారి జాఫర్ యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగవాడి గ్రామానికి 300 యూరియా బస్తాలు కేటాయించామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఆగస్టు నెలలో 4,000 యూరియా బస్తాలు పంపిణీ చేశామన్నారు. రైతుసేవ కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలో 5,375 బస్తాల యూరియా పంపిణీ చేశామని చెప్పారు

కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే ఉజ్వల భవిత

కురబలకోట: కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని హైదరాబాదు స్కిల్ జిమ్ ఓపీసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్లు లావణ్య రావ్ తెలిపారు. ఆదివారం అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫారెన్ లాంగ్వేజెస్‌పై ఆయన మాట్లాడుతూ బిటెక్ విద్యార్థులు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణించాలంటే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ కీలకమని పేర్కొన్నారు. ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగం సాధించేలా ఎదగాలన్నారు. ఇందుకు ఇతర దేశాల బాషలపై పట్టు సాధించాలన్నారు. జర్మన్, ఫ్రెంచ్, జపనీస్, స్పానీష్ వంటి విదేశీ బాషలను నేర్చుకోవాలని సూచించారు.

నాగరాజ సేవలు ప్రశంసనీయం



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

మదనపల్లె సిటీ: తెలుగు ఉపాధ్యాయుడిగా కన్నెమడుగు నాగరాజ సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కన్నెమడుగు నాగరాజ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. 36 సంవత్సరాలు తెలుగు ఉపాధ్యాయుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అన్నారు. ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, గంటా మోహన్, మధుసూధన్, మహమ్మద్‌ఖాన్, అయూబ్‌ఖాన్, గిరిధర్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, పద్మావతమ్మ, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కలకడ : ఎంపీడీఓ కార్యాలయం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రత్యేక ఆహ్వానితులు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు. మండలస్థాయి అధికారులు నివేదికలతో రావాలని పేర్కొన్నారు.

వెళ్లి రావయ్యా.. విఘ్న నాయకా

- ఘనంగా గణనాథుడి నిమజ్జనం
- అంబరాన్నంటిన సంబరాలు
- ఉత్సవాల్లో కేరింతలతో యువత



పీలేరు : గంగమ్మ ఒడికి ఊరేగింపుగా వెళుతున్న విఘ్నేశ్వరుడు



పీలేరు : కళాకారుల వాయిద్యాలను ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

పీలేరు : పీలేరు పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య యువకులు సందడి చేస్తూ ఏకదంతుడికి వేడుకగా శోభాయాత్ర నిర్వహించారు. మదినిండా విఘ్ననాయకుడిని కొలిచి.. నిమజ్జనం చేశారు. ఉదయం 10 గంటల నుంచే పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం మొదలైంది. స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. విగ్రహాలన్నీ స్థానిక శివాలయం, మదనపల్లె మార్గంలోని తిమ్మారెడ్డి క్రాస్ మీదుగా ఎల్‌బీఎస్ రోడ్డు, క్రాస్ రోడ్డు, కడప రోడ్డు మార్గంలో ఊరేగింపుగా అయ్యపునాయునిచెరువు వద్దకు చేరుకున్నాయి. ఎల్‌బీఎస్ రోడ్డు, అజంతామిట్ట, పంచాయతీ కార్యాలయం, బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి, యల్లమంద క్రాస్ గుండా అయ్యపునాయుని చెరువు వరకు విగ్రహాల భారీ ఊరేగింపు సాగింది. ఊరేగింపు సందర్భంగా ప్రతి బండి వద్ద డీజే సాంగ్స్, బళ్లారి డ్రమ్స్, కేరళ వాయిద్యాలు, చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. వేలాదిమంది భక్తులు, ప్రజలతో ఎల్‌బీఎస్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఊరేగింపు అనంతరం సుమారు 150 విగ్రహాలు స్థానిక అయ్యపునాయుని చెరువులో నిమజ్జనం చేశారు. గణేష్ ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పీలేరు పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. పలువురు భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం మండలంలో..

పెద్దతిప్పసముద్రం: వినాయకచవితి సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక ప్రతిమలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించి ఉత్సాహంగా నిమజ్జనానికి తీసుకెళ్లారు.

తంబళ్లపల్లె: మండలంలో పలు గ్రామాల్లో వెలసిన వినాయక విగ్రహాలకు ఐదవ రోజు ఆదివారం నిమజ్జనం చేశారు. ఎద్దులవారిపల్లె, జన్నెవారిపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో అలంకరించి కోలాటలు, పిల్లనగ్రోవి కళాకారుల నృత్యాలు, యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె, ఇందిరమ్మకాలనీ, కలకడ కాలనీ, వడ్డిపల్లె, జగనన్న కాలనీ తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం పూజలు చేసి నిమజ్జనానికి విగ్రహాలను తీసుకెళ్లారు. హోటల్ ఎస్వీ భవన్, సుధాకర్ లాడ్జ్, శ్రీనివాసరెడ్డి కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన వేలం పాటలో లడ్డూ రూ.1.50 లక్షల దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్న కలకడ ఇందిమ్మ కాలనీలో చాన్‌బాష రూ.34 వేలుకు లడ్డూ దక్కించుకున్నారు.

వేడుకగా నిమజ్జనం

రామసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం లంబోదరుడి నిమజ్జనం ఘనంగా చేశారు. వినాయక చవితి సందర్భంగా 5వ రోజు మేళ తాళాలతో అంగరంగ నిమజ్జనం నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. రెడ్డి వీరే గౌడు, సుధాకర్, మంజు, శ్యాంప్రసాద్, సంతోష్, లోకేష్, సునీల్, ఉపేంద్ర, దేవరాజ, మర్రి నంజే గౌడు, బసవరాజ పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జన వేడుకలు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కొత్తపేట, ఎల్లుట్ల గడ్డ వీధుల్లో కొలువు దీర్చిన స్వామివారి విగ్రహాలకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన నృత్యకళాకారుల విన్యాసాలు, గిరిజనలు జానపదాలు, మల్లయ్యకొండ భల్లూకవేషధారణలు ఊరేగింపులో అందరినీ ఆకట్టుకొన్నాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రఘురామ్ గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో ఆదివారం సొసైటీకాలనీ, నిమ్మనపల్లె రోడ్డు, నీరుగట్టువారిపల్లె, గొల్లపల్లి, కాలేజీ రోడ్డు ప్రాంతాల్లోని వినాయకుడి విగ్రహాలకు ఘనంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. బళ్లారి డ్రమ్ముల వాయిద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కొలాటాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. మరో పక్క బాణాసంచా శబ్దాలతో ఊరేగింపు సందడిగా సాగింది. పలు చోట్ల లడ్డు వేలం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



పీలేరు : ప్రత్యేక ఆకర్షణగా డీజే సౌండ్స్, లైటింగ్



పెద్దతిప్పసముద్రం: గణేషుడిని నిమజ్జనానికి సాగనంపుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు



తంబళ్లపల్లె: వినాయకుడి శోభాయాత్రలో యువకులు



కలకడ : ఏకదంతుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



పీలేరు : పల్లకిలో గౌరీ పుత్రుడు



రామసముద్రం: నిమజ్జనానికి తరలిన పార్వతీ తనయుడి వద్ద స్థానికుల సందడి



గుర్రంకొండలో లంబోదరుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



మదనపల్లె సిటీ: ఊరేగింపుగా వెళుతున్న వినాయకుడి విగ్రహాలు

మానవత సేవా సంస్థ సేవలు విస్తృతం చేస్తాం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గసభ్యులు



మాట్లాడుతున్న సయ్యద్‌సాహెబ్

మదనపల్లె సిటీ: మానవత సేవా సంస్థ సేవలు మరింత విస్తృతం చేస్తామని మదనపల్లె డివిజన్ సంస్థ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరయ్యారు. నూతన కన్వీనర్‌గా భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకరప్పనాయుడు, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్‌రెడ్డి, సహ కార్యదర్శిగా హరినాథ్‌బాబు, ఈసీ మెంబర్లుగా రమణప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, రాధికాబాయి, సరస్వతమ్మను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు జె.కృష్ణమూర్తి, సెంట్రల్ కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, రామానాయుడు పాల్గొన్నారు.

కలకడ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను విస్తృతం చేద్దామని కలకడ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన అధ్యక్షులు సయ్యద్‌సాహెబ్ తెలిపారు. ఆదివారం సయ్యద్‌సాహెబ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదును పెంచేందుకు సభ్యులు కృషి చేయాలని సభ్యులు సయ్యద్‌సాహెబ్ కోరారు. అదే విధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మానవత విలువలు, భవిషత్తు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందించాలని సూచించారు. సభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, కె.లక్ష్మిరెడ్డి, లక్ష్మన్న, కె.శ్రీనివాసులురెడ్డి, వీపీ నాయుడు, పీవీ రమణ, వైవీ రమణ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు



గంగమ్మ ఆలయం ఎదుట కొబ్బరి కాయలు కొట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి: లిక్కర్ అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి విడుదల కావాలని కలికిరి మండలం కొటాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సంబేపల్లి మండలంలోని నల్లవీర గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టారు. నల్లవీర గంగమ్మ ఆశీస్సులు లభించి అక్రమ కేసు నుంచి భయటపడాలని వారు ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వాసునూరి వెంకటపతి, నాయకులు మునెయ్య, కొటాల విజయ్, నాగరాజ, శివయ్య, గణేష్, శివశంకర్, శివకుమార్, మునిక్రిష్ణ, తులసి, సిద్దయ్య, విశ్వనాథ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా

నందలూరు : రైల్వేకోడూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో నందలూరు విజ్‌డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీలలో అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లా నుంచి తైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు. విజ్‌డమ్ పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వలిమి మనోజ్ఞ, ఎంబలూరు విశిష్ఠ దేవాంక్, మోక్షిత్, నిర్వాన్ నందన్, గగన దీపిక, తసిఫా బంగారు పతకాలు సాధించారు. భువన్, షహనాజ్, సమీనా, సాజిద్ రజక పతకాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ వలిమి రాధ అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆమె సూచించారు.

లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం



లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న డీఏఓ నిర్మలాదేవి, జిల్లా ఏడీ భరత్

మదనపల్లె రూరల్ : మదనపల్లె రెవెన్యూ డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయమని జిల్లా భూ,సర్వే రికార్డుల ఏడీ భరత్ అన్నారు. ఆదివారం డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే లక్ష్మీనారాయణ పదవీవిరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా భూసర్వే రికార్డుల ఏడీ భరత్, లక్ష్మీనారాయణ దంపతులను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవి, చిత్తూరు ఉమ్మడిజిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు రవిచంద్ర పాల్గొన్నారు.

ధర రూ. 266.. అమ్ముతోంది రూ.300

- అధిక ధరకు యూరియా విక్రయం
- పట్టించుకోని అధికారులు



యూరియా కొనుగోలు చేసి తీసుకెళుతున్న రైతు ఆనందరెడ్డి

కలికిరి: సాగు సమయం ఆసన్నమైంది.. రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను అందించలేకపోతోంది. ఇలాంటి సమయంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడీకి దిగుతున్నారు. కలికిరి పట్టణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266.50 రైతులకు విక్రయించాల్సి ఉండగా రూ.300లకు దుకాణాదారులు విక్రయిస్తున్నారు. కలికిరి పట్టణంలో ఓ ఎరువుల దుకాణానికి ఒక లోడు యూరియా సరఫరా కాగా సుమారు సగ లోడు బస్తాలను అధిక ధరకు విక్రయించారు. మిగిలిన యూరియా బస్తాలను తన సమీప బంధువులకు చెందిన మరో ప్రాంతానికి తరలించి అక్కడ రూ.340, ఆపై ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. యూరియా కొరతను అదునుగా ఎంచుకున్న వ్యాపారులు యూరియా బస్తా కావాలంటే డీఏపీ ఒక బస్తా కొనాలన్న షరతుతో అక్కర లేకపోయినా రైతులకు అదనంగా డీఏపీ విక్రయిస్తున్నారు. యూరియా కావాల్సిన రైతులు చేసేది లేక యూరియాతో కలిపి డీఏపీ బస్తా కొనాల్సి వస్తోంది. ఎరువుల దుకాణాల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిబంధనలను వ్యాపారులు పట్టించుకోవడంలేదు. ఎరువులు పురుగుమందుల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యమైంది. పండించిన పంటలకు ధరలు లేక నష్టపోతున్న రైతన్నలకు ఇలా అధిక ధరల ధరాఘాతం తప్పడంలేదు.

రైతు సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని రామాపురం పంచాయతీ ఆర్.కొత్తపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనమల సురేంద్రరెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం తరిగొండలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన రైతులకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత పంటల బీమా అందించామన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మామిడి, టమాటాతో పాటు ఇతర పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు పంటనష్టపరిహారం ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జగనన్న ప్రభుత్వంలో సకాలంలో రైతులకు పంటనష్టపరిహారం, పంటల బీమా అందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ఎండగట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ, సర్పంచ్ యల్లారెడ్డి, మాజీవైస్ ఎంపీపీ రెడ్డి నరసింహారెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, రమణ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమం



మాట్లాడుతున్న పీటీఎం.శివప్రసాద్

మదనపల్లె రూరల్ : సరళీకరణ, ప్రైవేటీకరణ వలన 90 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రైవేట్ రంగంలోకి వెళ్లిపోయిన నేపథ్యంలో, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వీసీకే పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన(బాస్) సంయుక్తంగా, ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతపై అవగాహన, ఉద్యమ కార్యాచరణ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ రిజర్వేషన్లను సరళీకరణ-ప్రైవేటీకరణ కబళించడంతో రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బాస్ రాష్ట్ర అధ్యక్షులు ఉలగనాథన్ గణపతి, కేంద్రకమిటీ సభ్యులు కే.వి.రమణ, ముత్యాలమోహన్, నీరుగట్టిరమణ, వినోద్‌కుమార్, సింగన్న, సొన్నికంటి రెడ్డెప్ప, తలారికృష్ణ, వై.గంగాధర్, శ్రీనివాసులు, జీ.వి. రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తవ్వుకున్నోళ్లకు.. తవ్వుకున్నంత!

ఏ వ్యాపారమైనా సప్లయ్, డిమాండ్ సూత్రంగా సాగుతుంది. డిమాండ్ ఎక్కువైనప్పుడు భారీగా లాభాలు కళ్ల చూడవచ్చు. ఇదే సూత్రాన్ని అక్రమార్కులు ఫాలో అవుతున్నారు. యథేచ్ఛగా మట్టి, మొర్రం కొల్లగొట్టి లక్షలు గడిస్తున్నారు. ప్రకృతి సంపద హరించుకుపోతున్నా.. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

- యథేచ్ఛగా మట్టి, మొరం తవ్వకాలు
- రూపురేఖలు కోల్పోతున్న గుట్టలు, చెరువులు
- పట్టించుకోని అధికారులు



నున్న గుట్టల్లో ఎక్సకవేటర్‌తో ట్రాక్టర్లలో మట్టి పోస్తున్న దృశ్యం

గుర్రంకొండ: అక్రమార్కుల తవ్వకాలతో గుట్టలు, చెరువులు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ సంపాదనను కొల్లగొడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రోజు రోజుకు మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల పరిసరాల్లోని పలు, గుట్టలు, చెరువులు, గుట్టలను తవ్వి మట్టి అక్రమ రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అయినప్పటికి అక్రమ వ్యాపారాన్ని నిలువరించే వ్యవస్థే కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో పెద్ద ఎత్తున ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇందులో వందల లోడ్ల మట్టిని తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. వీరే కాక రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ ప్లాట్లను చదును చేసుకునేందుకు ఎక్సకవేటర్‌తో చెరువులను అనుమతి లేకుండా తోడేసి మట్టిని తరలిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గుట్టలు, చెరువులను ధ్వంసం చేస్తున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

గుట్టలు, చెరువుల్లో అక్రమంగా మట్టి తరలించకూడదంటూ స్థానిక రెవెన్యూ అధికారులు పలుమార్లు ఆదేశాలు జారీ చేస్తున్నా రియల్ వ్యాపారులు, దళారులు ఖాతరు చేయడం లేదు. వారం రోజుల క్రితం ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఎక్సకవేటర్‌తో కండ్రిగ గ్రామ పరిధిలోని ఓగుట్టను ఇష్టానుసారం తవ్వేశాడు. అలాగే కొంతమంది నర్సరీల ఏర్పాటు కోసం భూమిని చదును చేయడానికి గుట్టల్లో మట్టిని ఇష్టానుసారం తవ్వేశాడు. స్థానిక రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి సదరు రియల్‌వ్యాపారిని మందలించినా ఖాతరు చేయకుండా మట్టిని తరలించడం గమనార్హం.

చర్యలు తీసుకొంటాం

అనుమతి లేకుండా గుట్టల్లో మట్టిని తీసుకుపోతున్న వారిపై చర్యలు తీసుకొంటాం. గుట్టలు, చెరువుల్లో మట్టిని తరలించడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అవసరమైన వారు ప్రతిపాదనలతో అనుమతి కోరితే పరిశీలిస్తాం.

– సదాశివప్పనాయుడు, ఇన్‌చార్జి ఆర్ఐ, గుర్రంకొండ